ఉపాధి కూలీలకు బీమా

- ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా రూ.2 లక్షలు
- పాక్షిక వైకల్యం కలిగిన కూలీలకు రూ.లక్ష
- ఉపాధి పనుల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్న కూలీలకే వర్తింపు



ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చర్ల: ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు జీవిత బీమా దక్కనుంది. పనులు లేక పస్తులు ఉండలేక వలస వెళ్తున్న వారిని నియంత్రించి వారి స్వస్థలంలోనే పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఎందరికో వరంలా మారగా, ఇప్పుడు ఆ పథకంలో పనిచేసే కూలీలకు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం అందించనున్నారు. ఉపాధి కూలీలకు జీవిత బీమా కల్పించేందుకు వీలుగా ఇప్పటికే అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కార్డులు ఉండి పనులు చేస్తున్న కూలీల్లో ఎంతమందికి పీఎంఎస్‌బీవై బీమా ఉంది? ఎంత మందికి లేదు? అనే వివరాలను సేకరిస్తున్నారు. మండలంలోని 26 గ్రామాల్లో 10,389 ఉపాధి హామీ పథకం కార్డులు ఉండగా వాటిలో 5,321 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. వీటిలో పేర్లున్న వారిలో సగటున మండలంలో 9,631 మంది కూలీలు పనులకు హాజరవుతున్నారు.

నిబంధనలివే..

- ఉపాధి హామీ పథకం ద్వారా పనిచేసే ప్రతీ కూలీకి ఏదైనా బ్యాంకు లేదా పోస్టాఫీస్‌లో ఖాతా కలిగి ఉండాలి.
- బీమా కోసం నమోదు చేసుకునే కూలీ 20 నుంచి 70 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలి.
- ప్రతీ సంవత్సరం బీమా ఆటోమెటిక్‌గా రెన్యూవల్ అయ్యేందుకు వీలుగా బ్యాంకుకు అంగీకార పత్రం ఇవ్వాలి.
- ప్రతీ సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ లోపు బీమా రెన్యూవల్ అయ్యేందుకు వీలుగా బ్యాంకు ఖాతాలో సరిపడా డబ్బులు ఉంచుకోవాలి.

ప్రయోజనాలు ఇవీ..

- ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన పథకం కింద పేర్లు నమోదు చేసుకున్న వారు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు బీమా ఉంటుంది.
- పూర్తి అంగవైకల్యం సంభవించినా రూ.2 లక్షలు వస్తాయి.
- పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.లక్ష అందుతుంది.

కూలీల ఆసక్తి

కేవలం రూ.20 చెల్లించడం ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా వచ్చే అవకాశం ఉండడంతో కూలీలు ఆసక్తిని చూపుతున్నారు. 18 నుంచి 70 ఏళ్ల వయస్సు కలిగిన ఉపాధి కూలీల్లో ఇప్పటికే మండలంలో 40 శాతానికి పైగా పేర్లు నమోదు చేసుకోగా మిగిలిన వారిని కూడా ఈ పథకంలో చేర్పించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

పేద కుటుంబాలకు మేలు



ఉపాధి హామీ పథకం కూలీలకు ప్రభుత్వం బీమా అమలు చేసేందుకు ముందుకు వస్తుండడం సంతోషాన్ని కలిగిస్తోంది. ఈ పథకం అమలు, కలిగే ప్రయోజనంపై అవగాహన కల్పించారు. నిరుపేదలకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కూలీలంతా బీమా పథకంలో చేరాలి.

–ఎం.రాజు, తేగడ

కూలీలందరికీ ప్రయోజనం..



ఉపాధి హామీ పథకం కూలీల కుటుంబాలకు పీఎంఎస్‌బీవై పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. కేవలం రూ.20 చెల్లించడం ద్వారా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.2 లక్షల బీమా వచ్చే అవకాశం ఉండడంతో ప్రతీ ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లకు అవగాహన కల్పించాలని ఆదేశించాం.

–సాంబశివరావు, ఇన్‌చార్జ్ ఏపీఓ, చర్ల

క్లుప్తంగా

ఎయిర్ వాల్వ్ లీకేజీకి మరమ్మతులు



మరమ్మతులు చేసిన తర్వాత ఇలా..

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని జమ్మిగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఎదుట ఉన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ వద్ద లీకేజీకి శనివారం అధికారులు మరమ్మతులు చేయించారు. 'సాక్షి'లో 'మిషన్ భగీరథ నీళ్లు తాగితే వ్యాధులే' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్థానిక అధికారులు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తీక్ ఆధ్వర్యంలో ఎయిర్ వాల్వ్ లీకేజీ వద్ద మరమ్మతులు చేయించారు. కొద్ది నెలలుగా వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

భద్రాచలంటౌన్: రాష్ట్ర విభజనలో ఏపీలోని ఎటపాక, పురుషోత్తపట్నం గ్రామపంచాయతీ పరిధిలోకి చేర్చిన రాజుపేట కాలనీవాసులకు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం 20వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీసీఎల్ ఏఈకి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. విద్యుత్ కనెక్షన్ల విషయంలో ఇరు రాష్ట్రాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ లైన్లు, ట్రాన్స్ మిషన్ విభజన చేయలేదని చెబుతూ వినియోగదారులను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కొత్త మీటర్లు ఇచ్చే విషయంలో స్పష్టత లేకపోవడంతో ఇరు రాష్ట్రాల అధికారుల వ్యవహార తీరులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ విద్యుత్ ఉన్నతాధికారులు సమన్వయంతో ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు నాదెళ్ల లీలావతి, కనకశ్రీ, నాగలక్ష్మి, రమణ, దేవి, కత్రీశివ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయం

మణుగూరురూరల్: మహమ్మద్ ప్రవక్త బోధనలు ఆచరణీయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర అయిన గీటురాయి పుస్తకాన్ని జమాత్ ఏ ఇస్లామి హింద్ సభ్యులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు స్థానిక ప్రజాభవన్‌లో అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త ఆచరణ విధానాలు, పరమత సహనం, మానవతా విలువలు, నైతికతతో కూడిన జీవన విధానం ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జామాత్ ఏ ఇస్లామి హింద్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, సభ్యులు ఎస్‌డీ ఉమర్, నిజాముద్దీన్, అల్తాఫ్ షరీఫ్, యాకూబ్‌అలీ, మహమూద్‌పాషా, అబ్దుల్ మజీద్, రహీంపాషా పాల్గొన్నారు.

ఇస్లామిక్ ధార్మిక సభకు తరలిరండి

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని జామియా మసీద్ ఆవరణలో నిర్వహిస్తున్న ఇస్లామిక్ ధార్మిక సభకు తరలి రావాలని సదర్ మసీద్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే వలీ పాషా, ఎస్‌కే నజీర్ కోరారు. శనివారం వారు మాట్లాడుతూ.. పట్టణ కేంద్రంలో నూతనంగా పునఃనిర్మించిన జామియా మసీద్‌ను ఆదివారం ప్రారంభిస్తుండగా.. మసీద్ వద్ద ఇస్లామిక్ ధార్మిక సభ జరుగుతుందన్నారు. నూతన మసీద్ ప్రారంభోత్సవం, ధార్మిక సభకు ముస్లింలు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు.

డిగ్రీలో ప్రవేశాలు

దమ్మపేట: మండలంలోని అకంపాలెం గిరిజన సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాల కోసం ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ స్పందన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏలో 19, బీకామ్(జనరల్)లో 30, బీకామ్(సీఏ)లో 5, బీఎస్సీ(బీజెడ్‌సీ)లో 17, బీఎస్సీ(ఎంపీసీఎస్)లో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కల గిరిజన మహిళలు నేరుగా కళాశాలకు వచ్చి, సంబంధిత కోర్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఐలాపురం ఆశ్రమ పాఠశాలలో ఎమ్మెల్యే తనిఖీ



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక: విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, మెనూ ప్రకారం రోజుకు సరిపడా ఆహారం పెట్టాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఐలాపురం ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది, హాస్టల్ గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసినా ఆయన భోజనంలో నాణ్యత లేకపోవడం, మెనూ ప్రకారం భోజనం లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు పిల్లలకి భోజనం అందించకపోవడంపై అధికారులను నిలదీశారు. ప్రభుత్వం వేల కోట్లు విద్యార్థులకు అందిస్తుంటే అధికారులు సరైన భోజనం అందించకపోవడంతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు పెంచినప్పటికీ వారికి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండలంలోని చెగర్శల పంచాయతీలో సుమారు 100 కుటుంబాలు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమయంలో కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై, ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు చూసి పార్టీలో చేరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రామనాథం, కంది సుబ్బారెడ్డి, ఉడుముల లక్ష్మారెడ్డి, పేరం వెంకటేశ్వర్లు, గంగిరెడ్డి వెంకటరెడ్డి, గంగిరెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



నివాళులర్పిస్తున్న నాయకులు

చర్ల: తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన యోధులను స్మరించుకుంటూ వారికి నివాళులర్పిద్దామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కల్లూరు వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం చర్లలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ సాయుధ పోరాట వీరుల సంస్మరణ సభ నిర్వహించగా.. ఆయన పాల్గొని మాట్లాడారు. నిజాం నిరంకుశ పాలనకు తొత్తులుగా ఉన్న పటేల్, పట్వారి, జమీందారులను తరిమి కొట్టిన కమ్యూనిస్టు గెరిల్లాల స్ఫూర్తిని నేటి యువతరానికి అందిస్తామన్నారు. 1948 సెప్టెంబర్ 17న కమ్యూనిస్టుల సాయుధ పోరాట ఫలితంగా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైందని పేర్కొన్నారు. పటేల్ చీకటి ఒప్పందం ఫలితమే నిజాంరాజుకు గవర్నర్ పదవి అని, సాయుధ పోరాట ఫలితంగానే నిజాం నిరంకుశ పాలన రద్దయ్యింది తప్ప పటేల్ సైనిక చర్యల వల్ల కాదని ఆయన వివరించారు. సాయుధ పోరాటంలో 4 వేల మంది అమరులయ్యారని, 10 లక్షల భూపంపిణీ జరిగిందని వెల్లడించారు. కార్యక్రమంలో అడ్డగర్ల తాతాజీ, నూపా పోతయ్య, నూపా తిరుపతిరావు, పాలంచ రామారావు, కోటి ముత్యాలరావు, చల్లా లక్ష్మీనారాయణ, పాలెం సత్యనారాయణ, కోడిరెక్కల రాజారావు, కొవ్వాసి దేవయ్య, భీమయ్య, మడకం నందయ్య, మురళి, గుండె సమ్మయ్య, నూపా రాము, డబ్బా శంకర్, గుండి శ్రీను, మడకం కమలేశ్, మడకం సోమయ్య, సుక్కయ్య, పోశయ్య, సోడి రామయ్య, దీపక్, మహేశ్, ముత్తయ్య, తోట శ్రీను, దేవి, మంగమ్మ, నర్సమ్మ, అనసూర్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలను పటిష్టం చేయాలి



భద్రాచలంటౌన్: మాట్లాడుతున్న రాంప్రసాద్

భద్రాచలంటౌన్: నియోజకవర్గంలో రాబోయే రోజుల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని, నాయకులు గ్రామాల్లో బీఆర్‌ఎస్ గ్రామ కమిటీలను పటిష్టం చేయాలని డివిజన్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, బోదేబోయిన బుచ్చయ్య అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో శనివారం జరిగిన నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ బలంగా ఉందన్నారు. పార్టీ అండతో గెలిచిన ఎమ్మెల్యే వేరే పార్టీలోకి వలస వెళ్లినప్పటికీ నాయకులు, కార్యకర్తలు అలాగే ఉన్నారని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు కార్యకర్తలను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సాగి శ్రీనివాసరాజు, పెనుమల్లు రామకృష్ణారెడ్డి, గంపరాంబాబు, దొడ్డి తాతారావు, ఐనవోలు పవన్‌కుమార్, కణితి రాముడు, ఎండీ జానీపాషా, ఆకోజు సునీల్‌కుమార్, రేపాక పూర్ణచందర్‌రావు, సోమిడి నర్సింహారావు, సాంబమూర్తి, రమణ, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల హర్షం..

దుమ్ముగూడెం: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అమెరికాలో అవార్డు రావడంపై మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ మండల కన్వీనర్, కోకన్వీనర్ కణితి రాముడు, యండీ జానీపాషా మాట్లాడుతూ.. కేటీఆర్‌కు అవార్డు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కొత్త మల్లేశ్వరరావు, వాగే వెంకటేశ్వరరావు, దామెర్ల శ్రీనివాసరావు, సరియం సీతారాం, కొరస నరసింహారావు, తంత్రపల్లి వెంకటేశ్వరరావు, జిలకర గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: ఆదివాసీల కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాల అమలుతో పాటు హక్కులను సాధించుకునేందుకు అందరూ కలిసి పోరాడాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. పట్టణంలోని గిరిజన అభ్యుదయ భవన్‌లో శనివారం ఐక్యరాజ్య సమితి ప్రపంచ ఆదివాసీ హక్కుల ప్రకటన దినోత్సవం నిర్వహించారు. ఆదివాసీ హక్కులు, చట్టాలపై తెలుగు రాష్ట్రాలస్థాయి సెమినార్‌కు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆదివాసీలకు హక్కులు, రాజ్యాంగం కల్పిస్తున్న చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. అనంతరం పలువురు వక్తలు ఆదివాసీ హక్కులు, చట్టాలు వివరించారు. కార్యక్రమంలో సొందె వీరయ్య, కోటా దేవదానం, ముర్రం వీరభద్రం, సోడి మురళి, ఆత్రం నవీన్, కొర్సా నర్సింహమూర్తి, ముద్దరాజు, శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సాయం



సరోజినికి చెక్కు అందిస్తున్న పంచాక్షరయ్య

బూర్గంపాడు: భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పంచాక్షరయ్య ప్రతినెల రూ.40 వేల ఆర్థికసాయాన్ని ప్రకటించారు. శనివారం ఇరవెండిలోని పంచాక్షరయ్య స్వగృహంలో ఆశ్రమ నిర్వాహకురాలు సరోజినికి ఆయన రూ.40 వేల చెక్కును అందించారు. తొలుత ఈ ఆశ్రమానికి ఆయన ప్రతి నెల రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. దానిని ఈ నెల నుంచి రూ.40 వేలకు పెంచారు. ఆశ్రమానికి గతంలో బిల్డింగ్‌ను కూడా తాళ్లూరి ట్రస్ట్ ఆధ్వర్యంలోనే నిర్మించారు. వృద్ధాశ్రమ నిర్వహణకు అండగా నిలుస్తున్న తాళ్లూరి పంచాక్షరయ్యకు ఆశ్రమ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బియ్యం వితరణ

మణుగూరురూరల్: మండలంలోని తోగ్గూడెంలో నిరుపేద కుటుంబానికి చెందిన బొర్ర కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఆయన కుటుంబానికి మణుగూరు ఏరియా పీకేఓసీ-2 మాజీ ఈపీ ఆపరేటర్లు 25 కేజీల బియ్యం ఇచ్చారు. అలాగే, చింతల శ్రీరాములు, గోపాలపురపు బ్రహ్మాచారి, ఊటుకూరు సత్యనారాయణ కుమారుడు జెశ్వంత్ శ్రీరామ్ సహకారంతో మరో 25 కేజీల బియ్యాన్ని శనివారం అందజేశారు.

రాజీ మార్గమే రాజమార్గం



మణుగూరురూరల్: పరిష్కారమైన కేసుల పత్రాలను అందజేస్తున్న మెజిస్ట్రేట్ సూరిరెడ్డి

మణుగూరురూరల్: లోక్ అదాలత్‌లతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని మణుగూరు ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ కోర్ట్ మెజిస్ట్రేట్ కె.సూరిరెడ్డి అన్నారు. శనివారం కోర్ట్ ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా.. మెజిస్ట్రేట్ సూరిరెడ్డి మాట్లాడారు. రాజీ మార్గమే రాజమార్గమన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా పరిష్కరించవచ్చని చెప్పారు. లోక్ అదాలత్‌లో సీసీ, పిటీ, బ్యాంక్ పీఎల్‌సీ వంటి కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. పలు కేసులకు జరిమానాలు సైతం విధించి రాజీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల లీగల్ కౌన్సిల్ సభ్యులు అంకం సర్వేశ్వరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బద్దం శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు, న్యాయవాదులు కందిమళ్ల నర్సింహారావు, పోశం భాస్కర్, చిర్ర సరస్వతి, మధుసూదన్‌రావు, సీఐ నాగబాబు, కోర్ట్ సిబ్బంది, కోర్ట్ కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

పులిహోర పంపిణీ

లయన్స్‌క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ కముజు చంద్రమోహన్ సౌజన్యంతో మణుగూరు కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన కక్షిదారులకు శనివారం పులిహోర పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు షేక్ మీరా హుస్సేన్, జోన్ చైర్ పర్సన్ ముత్తంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో..

భద్రాచలంటౌన్: క్షణికావేశంలో చేసిన తప్పునకు కేసుల పాలై ఏళ్ల తరబడి సమయాన్ని వృథా చేసుకోకుండా రాజీతో పరిష్కారం పొందవచ్చని భద్రాచలం ఫస్ట్‌క్లాస్ కోర్టు న్యాయమూర్తి వి.శివనాయక్ తెలిపారు. స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసులను ఆయన పరిష్కరించారు. అందులో దంపతుల గొడవలు, కుటుంబ తగాదాలు, బ్యాంక్ చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్‌తో పాటు పలు ఇతర కేసులు ఉన్నాయి. మొత్తం రాజీ కేసులు 75, మిగతా కేసులు 1,140 పరిష్కారమైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ తదతరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

దమ్మపేట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. శనివారం మండలంలోని గండుగులపల్లి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే జారే చేతులమీదుగా పలువురు లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యం, సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ తొలి ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

తుడుందెబ్బ ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ



ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గుండాల: ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండెం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆళ్లపల్లి మండలంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాలతో శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లంబాడీలు నిజాం ప్రభుత్వంలో మూడు లక్షలు అని సీతారామ్‌నాయక్, నాలుగు లక్షలు అని బెల్లయ్యనాయక్ అంటున్నారని, వారికి కనీస అవగాహన ఉందా అని ప్రశ్నించారు. లంబాడీలను 1976లో కేవలం విద్యాపరంగా వెనకబడి ఉన్నారనే ఉద్దేశంతో ఓ జీఓను తీసుకొచ్చి, డీఎస్టీ హోదా ఇచ్చిన మాట సమాజానికి తెలియదా అని పేర్కొన్నారు. షెడ్యూల్డ్ ట్రైబల్‌గా గుర్తింపు ఉందని అనడం సరికాదని, జీఓకు, చట్టానికి తేడా తెలుసుకోవాలని కోరారు. లంబాడీలు అనుభవిస్తున్న పదవులు, ఉద్యోగాలతోపాటు ప్రభుత్వ సబ్సిడీ పథకాలు కూడా రిజర్వేషన్ పేరుతోనే అనుభవిస్తున్నారని, ఆదివాసులకు పూర్తిగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పోరాటాలు కొత్త కాదని, హక్కుల కోసం, రాజ్యాం కోసం ఉద్యమం చేసిన చరిత్ర తమదేనని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆళ్లపల్లి మండల జేఏసీ అధ్యక్షుడు పాయం రమేశ్, కొమరం హనుమంతరావు, కోంద్రు మంజుభార్గవి, పాపారావు, పాయం నరసింహారావు, పాయం రామనరసయ్య, కొమరం వెంకటేశ్వర్లు, మడకం శ్రీను, పోడియం బాలరాజు, పాయం సత్యనారాయణ, వినోద్, లక్ష్మయ్య, పూణెం శ్రీను, శ్రీను, బొమ్మల కనకరాజు, వెంకటకృష్ణ, జరా భాస్కర్, కొమరం చంద్రం, సుధాకర్, కేశవరావు, సతీశ్, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేయాలని ధర్నా



మొండికుంటలో ధర్నా చేస్తున్న రైతులు

అశ్వాపురం: మండలంలోని ప్రధాన సాగునీటి వనరు, కాకతీయుల కాలం నాటి తుమ్మలచెరువు షట్టర్లు దెబ్బతిని కొన్ని రోజులుగా నీరు రాక పొలాలు ఎండిపోతున్నాయని, షట్టర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని మొండికుంటలో ప్రధాన రహదారిపై రైతులు శనివారం రాస్తారోకో చేశారు. రైతుల రాస్తారోకోతో ట్రాఫిక్ స్తంభించింది. సీఐ అశోక్‌రెడ్డి, సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఆందోళన విరమింపజేశారు. అనంతరం నీటిపారుదల శాఖ ఎస్‌ఈ నర్సింహారావు శనివారం తుమ్మల చెరువును సందర్శించారు. అధికారులు రైతులతో మాట్లాడి షట్టర్లు లేపే అవకాశాలపై చర్చించారు. గజ ఈత గాళ్లతో షట్టర్లు లేపే ప్రయత్నం చేస్తున్నామని, షట్టర్లు లేవకపోతే ప్రత్యామ్నాయంగా రైతుల పొలాలకు నీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ రమేశ్, ఏఈ సక్రు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ప్రయత్నం..

చెరువు షటర్లు పైకిలేవక, నీరు రాక పొలాలు ఎండిపోతుండడం, అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు గత రోజులుగా షట్టర్లు లేపే ప్రయత్నం చేస్తున్నారు. తుమ్మల చెరువు సమస్యపై రైతులు జిల్లా కలెక్టర్, ఎస్‌ఈకి విన్నవించారు. అధికారులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టినా రైతులు పట్టుదలతో తమ ప్రయత్నం కొనసాగించారు. ఎట్టకేలకు మెకానిక్ మల్లయ్య, రైతుల శ్రమతో ప్రధాన తూము షట్టరు కొంత పైకి లేచింది. కాల్వల ద్వారా నీరు ఆయకట్టుకు వస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికుల సమ్మెకు మద్దతు



దుమ్ముగూడెం: మద్దతు తెలుపుతున్న నాయకులు



పినపాక: సమ్మె చేస్తున్న కార్మికులు

అశ్వారావుపేటరూరల్: ఆశ్రమ, హాస్టళ్లలో పని చేస్తున్న దినసరి కార్మికుల నిరావధిక సమ్మెకు శనివారం సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. మండలంలోని అనంతారంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చేపట్టిన సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ సందర్శించారు. బత్తుల శ్రీను, వెంకటేషు, లక్ష్మీ, మంగ, సీత పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: డైలీవేజ్ వర్కర్లు చేపట్టిన సమ్మెకు పలువురు మద్దతు పలికారు. వారిలో వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి దాసరి సాయన్న, లక్ష్మీ, వీరస్వామి, సత్యం, పరమేశ్, వీరభద్రం ఉన్నారు.

మణుగూరులో..

మణుగూరురూరల్: సమ్మెలకు టీడీపీ నియోజకవర్గ అడ్‌హక్ కమిటీ సభ్యుడు వట్టం నారాయణదొర, దొడ్డి కృష్ణ, యలమాటి పూర్ణ, మద్దెల భద్రయ్య, ముక్కెర రాజేశ్వరరావు, హరి, సుమేశ్ సంఘీభావం తెలిపారు.

పినపాకలో..

పినపాక: కార్మికుల సమ్మెకు పలు సంఘాల నేతలు సంఘీభావం ప్రకటించారు. కొత్త జీఓలతో వారి బతుకులు ఆగం చేయొద్దని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.